క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



నిజామాబాద్‌నాగారం: కంఠేశ్వర్‌లోని మహిళా కళాశాలలో ఇటీవల జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సోమవారం విజేతలకు ఆరోగ్య చైతన్య వేదిక, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. వెంకటేశ్వర్లు, విజయానంద్, ప్రిన్సిపల్ భారతిరెడ్డి, కిషన్‌రెడ్డి, విద్యార్థినులు శ్రావణి, మిత్ర శ్రీ, ప్రసన్నలక్ష్మి, రోషిని ప్రియ, అక్షయ, సన ఫిర్దోస్, అయేష తబస్సుమ్, రహత్, రూప, లక్ష్మీప్రసన్న ఉన్నారు.

ఘనంగా హజ్రత్ కమల్‌షా ఉర్సు



నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ హజ్రత్ కమల్ షా బియాబాని (ఆర్ఎ)లో ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా నగరంలో చాదర్, గంధం ఊరేగింపు నిర్వహించారు. మూడురోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలను దర్గాకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్ వంశస్తులు నిర్వహిస్తున్నారు. మహ్మద్ అబ్దుల్ హఫీజ్, ఖాజమోయినుద్దీన్, జహీర్, హైమద్ అలీ, ఎం ఏ ఆఫీస్, మోయిస్, ఖాదిర్, నసీయుద్దీన్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు



ఖలీల్‌వాడి: రాష్ట్రంలో బీఆర్ఎస్ కుటుంబ పాలనను వద్దని, కాంగ్రెస్, సీపీఐ కూటమికి పట్టం కట్టిన తెలంగాణ ప్రజలకు వందనాలు తెలుపుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 6 గ్యారంటీలను, మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నెరవేర్చాల్సి ఉందన్నారు. అలాగే బీఆర్ఎస్ అవినీతిపై రానున్న నూతన ముఖ్యమంత్రి సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. నాయకులు భూమయ్య, ఓమయ్య, రంజిత్, రఘురాం ఉన్నారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంత్ చారికి తెలంగాణ విద్యార్థి పరిషత్(టీజీవీపీ) నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వినాయక్‌నగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహానికి వారు పూల మాలలు వేసి, ఆయన పోరాటాన్ని కొనియాడారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కల్యాణ్‌రామ్ మట్లాడుతూ.. ఒక విద్యార్థి సమాజం కోసం తాను చేసే ఉద్యమంలో ఎటువంటి త్యాగానికైనా వెనుకాడడని శ్రీకాంత్‌చారి నిరూపించారని కొనియాడారు. కార్యక్రమంలో నవీన్, సాయి కిరణ్, దేవేందర్, రవికిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

దోమలమందు పిచికారి



ఇందల్వాయి:మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో సోమవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది దోమల మందు పిచికారి చేశారు. ఈసందర్భంగా హెచ్ఈవో శంకర్ మాట్లాడుతూ..డెంగీ నివారణ కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు.దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

వామ్మో..వానరాలు

- సిరికొండ మండలంలో కోతుల స్వైరవిహారం
- మనుషులపై దాడి చేస్తున్న వైనం



సిరికొండ మండలంలో ఇళ్లపై సంచరిస్తున్న కోతులు

సిరికొండ: మండలంలో వానరాల స్వైరవిహారంతో జనం అల్లాడిపోతున్నారు. గ్రామాల్లో కోతులు గుంపులుగుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. ఇళ్లలోకి వచ్చి తినుబండారాలను, ఆహర పదార్థాలను ఎత్తుకెళుతున్నాయని వాపోతున్నారు. వాటిని తరిమితే తిరిగి దాడి చేస్తున్నాయని, కోతుల దాడితో పిల్లలు పెద్దలకు గాయాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు తూంపల్లి, కొండాపూర్, గడ్కోల్, కొండూర్, పెద్దవాల్గోట్, మైలారం తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా నెలకొంది. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ కోతులు దర్శనమిస్తున్నాయి. ఇళ్లలోకి, దుకాణాల్లోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతున్నాయి. దీంతో ప్రజలు రోజంతా తలుపులు వేసుకొని ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే పంట చేలపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. వీధుల్లో మందలుగా సంచరిస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతులకు పిల్లలు భయపడి ఆరుబయటకు వెళ్లలేకపోతున్నారు. ఇళ్లపైన తిరుగుతున్న కోతులను తరుముతుంటే ఎదురుతిరుగుతున్నాయని, మీదపడి గాయపరుస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కోతులు దాడి చేసిన సంఘటనలు చాలా చోటుచేసుకున్నాయి. గతంలో తూంపల్లి, పెద్దవాల్గోట్ వివిధ గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కోతులను బంధించి అడవుల్లో వదిలి పెట్టారు. అయినప్పటికీ కోతుల బెడద తగ్గడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లలేకపోతున్నాం..



మా గ్రామంలో కోతులు విపరీతంగా ఉన్నాయి. గ్రామంలో ఎక్కడ చూసిన కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లలేకపోతున్నాం. నిత్యం కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మందలుగా సంచరిస్తు ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.

-భీమన్న, తూంపల్లి

కోతుల బెడద నివారించాలి..



చాలా గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోకి వానరాలు చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతున్నాయి. వెంటనే పాలకులు, అధికారులు స్పందించి, గ్రామాల్లో కోతుల బెడదను అరికట్టాలి.

-సాయారెడ్డి, సిరికొండ

రికవరీ డబ్బులను చెల్లించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో గోపిబాబు

డిచ్‌పల్లి: ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్‌లో అభియోగాలు వచ్చిన వారందరూ రికవరీ డబ్బులు వెంటనే చెల్లించాలని ఎంపీడీవో టీవీఎస్ గోపి బాబు సూచించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఆర్‌డీఏ అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, సోషల్ అడిట్ విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గత సోషల్ ఆడిట్‌లో ఉపాధిహామీ పనులపై 368 అభియోగాలు వచ్చాయన్నారు. రూ.2.41 లక్షలు రికవరీ చెల్లించాల్సి ఉంటుందని ఆడిట్‌లో తేలిందన్నారు. అభియోగాలు వచ్చిన వారిలో కొందరు ఇప్పటికే రూ.లక్షా 50వేలు రికవరీ చెల్లించినట్లు తెలిపారు. సుమారు రూ.90వేలు రికవరీ చెల్లించాల్సి ఉండగా సోమవారం కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది రూ.27వేలు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రికవరీ సొమ్ములను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. 2024–25 సంవత్సరానికి హరితహారానికి సంబంధించి గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు కుందెన్ ఉమేష్, పరమేశ్వర్, సాయికుమార్, కంప్యూటర్ ఆపరేటర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది

ఆధ్యాత్మికం

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి గ్రామంలో సోమవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. వివిధ మండలాల నుంచి అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గురుస్వామి కుంట చిన్న గంగారెడ్డి, తిరుపతిరెడ్డి, కారోబార్ రాజన్న, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

సిరికొండ: మండలంలో కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం వచ్చింది. గతంలో కాంగ్రెస్ పార్టీకి సిరికొండ మండలం కంచుకోటగా ఉండేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో మండలానికి చెందిన బాజిరెడ్డి గోవర్ధన్ టీఆర్ఎస్ తరపున పోటీ చేయడంతో మండల వాసులు ఆయనకే జై కొట్టారు. 2018 ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్‌కే మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో మాత్రం మండల ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడు, డాక్టర్ భూపతిరెడ్డి వైపే మొగ్గుచూపారు. మండలంలో మొత్తం 32742 ఓట్లు ఉండగా, అందులో 25230 ఓట్లు పోలై 77.06 శాతం పోలింగ్ నమోదైంది. కాంగ్రెస్ అభ్యర్థికి 12827 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 8029 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 3331 ఓట్లు వచ్చాయి. బీజేపీ కూడా గత ఎన్నికల కంటే ఈ సారి పుంజుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గత వైభవం సంతరించుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్ల తర్వాత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలవడంతో పార్టీకి పునరుత్తేజం వచ్చినట్లయిందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మోపాల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ నమ్మకంతోనే మండల ప్రజలు చేతి గుర్తుకు ఓటేసి గెలిపించారని పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అధికార పార్టీ అభ్యర్థులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి రాష్ట్రంలో అధికారాన్ని అప్పగించారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగి వేసారిపోయారని, మార్పు కో రుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి ఎమ్మెల్యే భూపతిరెడ్డి గెలుపునకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



బర్ధిపూర్‌లో విద్యుత్ సరఫరా కావడంతో నీరు పోస్తున్న బోరుమోటారు

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలో విద్యుత్ లైన్లకు సోమవారం ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టారు. రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొనడంతో ఈ నెల 3న సాక్షి దినపత్రికలో 'కర్షకులకు కరెంట్ కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. ఈసందర్భంగా బర్ధిపూర్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజేందర్ మాట్లాడుతూ.. కరెంటు పునరుద్ధరణలో భాగంగా ఆరేపల్లి ఏజీఎల్ (త్రి ఫేస్) పనులు వేగవంతం చేశామన్నారు. త్వరలో బర్ధిపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. పొలాల్లో ఇంకా నీరు ఉండడంతో కరెంటు పునరుద్ధరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. లైన్‌మెన్ గంగారెడ్డి, రైతు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు భజన చేస్తు పల్లకీసేవ నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో గల దుర్గామాత, అయ్యప్ప, హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. నాయకులు సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మన్, మల్లయ్య, చిన్నారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండలంలోని గైనిగుట్ట స్వయంభూ బసవేశ్వరస్వామి ఆలయం, మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం నిర్వహించి దీపారాధన చేశారు. గైనిగుట్టలో అన్నదానం ఏర్పాటు చేశారు. శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి.

భీమన్న ఉత్సవాలు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో సోమవారం ఆదివాసీ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భీమన్న ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు కంచు సతీష్, మోహన్, లింగం, విజయ్, మగ్గిడి రాజేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా మూడవసారి విజయం సాధించిన వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అంబులెన్స్‌లో ప్రసవం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉద్మీర్ గల్లీకి చెందిన న్యావంది లావణ్య సోమవారం 108 అంబులెన్స్ ప్రసవించగా.తల్లీబిడ్డ ఉన్నారని సిబ్బంది తెలిపారు. లావణ్యకు (మూడోకాన్పు) పురిటి నొ ప్పులు అధికం అవడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. 108 అంబులెన్స్ ఇంటికి చేరుకొని ఆమెను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు అధికం అవడంతో మార్గమధ్యలో 108 సిబ్బంది లక్ష్మణ్, కేశవ్ కుమార్ ప్రసవం చేశారు. లావణ్య మగబిడ్డకు జన్మనివ్వగా, ఇద్దరు క్షేమంగా ఉన్నారు.

ఎమ్మెల్యేగా తొలిసారి గెలుపు..

- ఫలించిన రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి సుదీర్ఘ నిరీక్షణ



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ ఉద్యమకారుడిగా, డాక్టర్‌గా ప్రజల్లో గుర్తింపు పొందిన డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎమ్మెల్యేగా తొలిసారి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. 2001లో టీఆర్ఎస్ ఆవిర్భవించిన తొలిరోజుల్లో నిజామాబాద్ జిల్లాలో ఏఎస్ పోశెట్టి, డాక్టర్ బాపురెడ్డి తదితరులతో కలిసి డాక్టర్ భూపతిరెడ్డిలు తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. టీఆర్ఎస్ డిచ్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన ఆయా మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీని బలోపేతం చేశారు. ఉన్న కొద్దిపాటి కార్యకర్తలను కలుపుకునిపోతూ తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధిష్టానం, తెలంగాణ జేఏసీ ఇచ్చిన పిలుపులన్నింటిని విజయవంతం చేశారు. దీంతో 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి డిచ్‌పల్లి ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశించారు. కానీ టీడీపీ నుంచి ఎంపీగా ఉన్న కేశ్‌పల్లి గంగారెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరి వెంటనే డిచ్‌పల్లి టికెట్ తెచ్చుకోవడంతో పాటు విజయం సాధించారు. దీంతో తొలిసారి టికెట్ దక్కకపోవడంతో భూపతిరెడ్డి నిరాశకు గురయ్యారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో గంగారెడ్డి తన బదులుగా తన కొడుకు కేశ్‌పల్లి ఆనంద్‌రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నారు.

పలుమార్లు పార్టీలు మారినా..

2009లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్, తెలుగు దేశం పార్టీతో పొత్తు పెట్టుకుంది. పొత్తులో భాగంగా టీడీపీకి చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు టికెట్ దక్కించుకుని 5వ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అదే సమయంలో హీరో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ (పీఆర్‌పీ) ఏర్పాటు చేయడంతో డాక్టర్ భూపతిరెడ్డి అందులో చేరారు. రూరల్ ఎమ్మెల్యే టికెట్ దక్కుతుందని ఆశించగా, చివరకు డాక్టర్ రవీందర్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. ఇలా రెండోసారి భూపతిరెడ్డికి నిరాశే మిగిలింది. అయితే 2009 తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ ఆమరణ దీక్ష చేయడంతో భూపతిరెడ్డి తిరిగి టీఆర్ఎస్‌లో చేరారు. మరొకసారి టీఆర్ఎస్ రూరల్ ఇన్‌చార్జిగా ఆయ న క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేశారు. 2014 తెలంగాణ ఏర్పాటైంది. అదే సమయంలో ఎన్నికలు వచ్చాయి. టీఆర్ఎస్ నుంచి భూపతిరెడ్డికి టికెట్ ఖరారైంది. కానీ నామినేషన్ గడువుకు ఒక రోజు ముందు సీఎం కేసీఆర్ సీనియర్ నాయకు డు బాజిరెడ్డి గోవర్ధన్‌ను పిలిచి మరీ రూరల్ టికె ట్ ఇచ్చారు. అయితే కేసీఆర్ స్వయంగా భూపతిరెడ్డి ఇంటికి వచ్చి ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, సీఎం కేసీఆర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా భూపతి రెడ్డి అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన పరిణామాలతో భూపతిరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మరో మూడు సంవత్సరాలు ఆయన ఎమ్మెల్సీ పదవీ కాలం ఉండగా టీఆర్ఎస్ ఫిర్యాదుతో ఆయనపై వేటు వేశారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు 2023లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి అదే బాజిరెడ్డి గోవర్ధన్‌పై 21,923 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో ఎట్టకేలకు ఆయన ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

న్యాయవాదుల సంబురాలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా గెలవడంతో జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు టపాసులు పేల్చి, సీట్లు పంచుతూ సంబురాలు చేసుకున్నారు. బీజేపీ లీగల్ సెల్ న్యాయవాది వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఈ గెలుపు ప్రజల విజయంగా అభివర్ణించారు. ధన్‌పాల్ ఇదే స్ఫూర్తితో నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బీజేపీ లీగల్ సెల్ సభ్యులు జగన్మోహన్‌గౌడ్, బండారి కృష్ణనంద్, బిట్ల రవివసంత్‌రావు, విఘ్నేష్, విక్రమ్, జేపీ లోహియా, వెంకటరమణగౌడ్, మధుసూదన్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ ఉన్నారు.



సంబురాలు చేసుకుంటున్న న్యాయవాదులు

ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా విజయం సాధించడంతో సోమవారం ఆయనకు దివాసవి సొసైటీ ఆఫ్ ఎన్‌జే/ఎస్‌వై అధ్యక్షుడు సుబ్బారావు సన్నిధి అమెరికా నుంచి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. నిజామాబాద్ అర్బన్‌లో భారీ మెజార్టీతో అద్భుతమైన విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. త్వరలో అమెరికాలో ఎన్నారైలు ధన్‌పాల్ సూర్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలియజేసేందుకు వేచి చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	63,400	వెండి (కిలో)	80,000
22 క్యారెట్స్	58,460	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	15	30
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	15	30	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	యానిమల్(హిందీ) 9.30 యానిమల్(తెలుగు) 1.15 సామ్ బహదూర్(హిందీ) 5.00, 7.50, 10.40
స్క్రీన్-3	యానిమల్(హిందీ) 11.10, 3.00, 10.30 యానిమల్(తెలుగు) 6.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యానిమల్(తెలుగు,9.00,1.00, 5.00, 9.00
స్క్రీన్-2	యానిమల్(హిందీ) 10.00,2.00, 6.00, 10.00
స్క్రీన్-3	సామ్ బహదూర్(హిందీ) 12.40, 3.50, 7.00, 10.10
స్క్రీన్-4	పల్లె గూటికి పండుగొచ్చింది(తెలుగు), 10.00 అడ్డా(తెలుగు) 3.50 సహస్ర(తెలుగు) 6.40 రాథోడ్(తెలుగు) 9.45
దేవి	ఆదికేశవ(తెలుగు)
నటరాజ్	అథర్వ(తెలుగు)
లలితామహల్	యానిమల్(తెలుగు)
విజయ్	యానిమల్(హిందీ)